క్లుప్తంగా

మతసామరస్యానికి ప్రతీక ఉర్సు



ఉర్సులో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తదితరులు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో ఏటా జరిగే ఉర్సు ఉత్సవం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. ఉర్సులో ఆయన పాల్గొని దట్టీలను సమర్పించారు. నేతలు కళ్లెం శంకర్‌రెడ్డి, సతీష్, పండాల శ్రీధర్, బద్దం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను త్వరలో పరిష్కరిస్తాం



పూడికతీత పనులను చేయిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: సుల్తానాఅల్వా కాలనీలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ విస్తరించనందునే మురుగు పరుగు సమస్య తలెత్తుతోందని త్వరలో నాలా విస్తరణ పనులు చేపడుతామని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాలనీలో మురుగు సమస్యను పరిశీలించారు. స్పందించిన ఆయన శానిటేషన్, వాటర్ వర్క్స్ సిబ్బందిని కాలనీకి రప్పించి నాలాలో పూడికతీత పనులు చేయించారు. అనంతరం ఆయన నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీలో ఉన్న సాయిబాబా మందిరానికి వెళ్లి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సిబ్బంది రాజేందర్, శ్రీనివాస్, స్థానిక నేతలు రాము, ప్రేమ్‌కుమార్, సతీష్, సద్ది సందీప్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పగలూ వెలుగుతున్న వీధి దీపాలు



హస్తినాపురం ఈస్ట్ కాలనీలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

వనస్థలిపురం: కాలనీలలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా తయారవుతోంది. పలు ప్రాంతాలలో రాత్రి వేళల్లో వెలగాల్సిన వీధి దీపాలు పగలు సైతం వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాయి. ఉదయం 6 గంటలకు ఆరిపోవాల్సిన వీధి దీపాలు మిట్ట మధ్యాహ్నం అయినా వెలుగుతూనే దర్శనమిస్తున్నాయి. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం ఈస్ట్, శ్రీనివాసపురం తదితర కాలనీలలో వీధి దీపాలు పగలు వెలగడం సాధారణమైపోయింది. వీధి దీపాల నియంత్రణలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది విఫలమవుతున్నారని, విద్యుత్ వృథా అవుతోందని కాలనీల ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు పగలు వెలుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతిచెందిన పాండయ్య (ఫైల్)

హస్తినాపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి రణించాడు. వనస్థలిపురం పోలీసుల సమాచారం మేరకు... నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వెంకటంపేట గ్రామానికి చెందిన తిరుమణి పాండయ్య(40) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ తన భార్య లలితతో కలిసి బీఎన్‌రెడ్డినగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం గుర్రంగూడకు వెళ్లిన తన భార్య లలితను తీసుకురావడానికి పాండయ్య గుర్రంగూడకు తన బైకుపై వెళ్లాడు. కాగా పాండయ్య భార్య లలిత బీఎన్ రెడ్డి నగర్‌లోని ఫైటెక్ ఏవిఏషన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటేందుకు నిలబడింది. అదే సమయంలో అటుగా వస్తున్న నీలం రవీందర్ అనే వ్యక్తి తన కారును అతివేగంతో రోడ్డు పక్కన తన భార్య కోసం వేచి ఉన్న పాండయ్యను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన పాండయ్యను చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాండయ్య బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పాండయ్య మృతికి కారణమైన నీల రవీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంబరాన్నంటిన ఉగాది సంబురం

మన్సూరాబాద్: శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రావణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

- సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలోని ఉగాది వేడుకలను నిర్వహించారు. హయత్‌నగర్ డీసీ మారుతీదివాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాకారులను ఘనంగా సన్మానించారు.
- మన్సూరాబాద్ ఆదిత్యానగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, విజయశ్రీకాలనీలోని గోదా సమేత పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించారు. సహారాస్టేట్స్ కాలనీలోని లలితా నాగలింగేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రావణం నిర్వహించి, ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.
- దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో పంచాంగ శ్రావణం చేపట్టారు.
- కర్మన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈఓ శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్‌ల ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.
- సచివాలయనగర్ గాయత్రానగర్‌కాలనీలో బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పంచాంగాన్ని ఆవిష్కరించారు.



సచివాలయనగర్‌కాలనీలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీదివాకర్

మలక్‌పేట పరిధిలో...

దిల్‌సుఖ్‌నగర్: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సర్వశుభాలకు ప్రారంభమైన ఉగా(ఆ)ది పర్వదినాన్ని మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలో ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. శిశిరానికి వీడ్కోలు పలుకుతూ వసంత రుతువును ఆహ్వానించే ఉగాదిని ప్రజలందరూ తమ కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. మలక్‌పేట జోన్ ఆర్‌కేపురంలోని అష్టలక్ష్మి ఆలయం, సరూర్‌నగర్ రామాలయం, శివాలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని శివాలయం, శ్రీసత్యనారాయణ స్వామి, మలక్‌పేట్‌లోని అండాళ్ నిలయం, హరిహర క్షేత్రం, హస్తినాపురంలోని అయ్యప్ప స్వామి, సైదాబాద్‌లోని విజయదుర్గా దేవాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం

చంచల్‌గూడ: శోభ కృత్ నామ ఉగాది పర్వదినం సందర్భంగా కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ శ్రీ రామాలయంలో బుధవారం పంచాంగ శ్రవణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఈ నెల 30న శ్రీరామభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించిన వేదపండితులు లగ్నపత్రికను రాశారు. ఆలయ కమిటీ సభ్యులు సంపత్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, ధనరాజ్‌యాదవ్, శ్రీనివాస్, గోపి, వీరేష్, ధన్‌రాజ్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్, యాట ప్రమోద్, రాజపాల్‌యాదవ్, రాహుల్ కిషోర్‌యాదవ్, మనీష్, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



గాయత్రీనగర్‌కాలనీలో పంచాంగ ఆవిష్కరణలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి



దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో పంచాంగ శ్రవణం



కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల సందడి



పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు



మలక్‌పేట్ హరిహర క్షేత్రంలో పంచాంగ శ్రవణం



ఉప్పరిగూడ రామాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం

రామచంద్రారావుకు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ రామచంద్రారావు

నాగోలు: సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎస్. రమచంద్రారావుకు ఉగాది సందర్భంగా వేదహిత ఉగాది పురస్కారాన్ని అందజేశారు. వేదహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రమచంద్రారావుకు పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేదహిత ఫౌండేషన్ చైర్మన్ మన్యురింద్ర శర్మ, వైస్ చైర్మన్ మహాలక్ష్మి, రచయిత కె.మురళీమోహన్ రాజు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నగరవాసికి సిల్వర్ మెడల్



సాక్షి, సిటీబ్యూరో: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 19వ ఆల్ ఇండియా బీఎస్‌ఎన్‌ఎల్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. 85 కేజీల విభాగంలో ఎల్బీనగర్‌కు చెందిన ఎస్‌వీ నారాయణ సిల్వర్ మెడల్ సాధించాడు. పలువురు ఆయనను అభినందించారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ /వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట కిలో రూ. 17, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 55, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 13, క్యారెట్ 17, దొండ 37, ఆలు 19, ఉల్లి 14, గోకర 45, దోస 35, సొర 9, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 55, అర్వి 55, మునగ 55, చిలగడదుంప 37, బీట్‌రూట్ 17, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి.

30న సీతారాముల కల్యాణోత్సవం

నాగోలు: బండ్లగూడ అజయ్‌నగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో ఈ నెల 30న సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి శ్రీధరాచార్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో శ్రీ సీతారాములు కల్యాణోత్సవానికి సబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 29న ఉదయం అభయాంజనేయ స్వామికి 108 లీటర్లతో పాలతో అభిషేకం, 30వ తేదీన ఉదయం 11 గంటలకు అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కల్యాణోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కమ్యూనిటీ హాల్ నిర్మాణం భేష్



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్లు నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసులు తమ సొంత నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బృందావన్‌కాలనీలో టీ పీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి రూ. లక్ష విరాళం ఇవ్వగా, కాలనీవాసులు పోగు చేసుకున్న రూ. 5.50 లక్షలతో నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్లుతో పాటు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ... కాలనీవాసులు ఐకతతో ప్రభుత్వంపై ఆధార పడకుండా కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకుని ఆదర్శంగా నిలిచారన్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. కాలనీ నేతలు ఎర్ర హరిబాబు, భూపాల్‌రెడ్డి, యశోద, పారంద సత్యనారాయణ, సుధాకర్, ఎర్ర మహేందర్, కోదండ సురేష్, సరికొండ యాదయ్య, పారంద శ్రీనివాస్, రాంచందర్, నాయకులు బండారి భాస్కర్, కడారి యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి లీకేజీలను అరికట్టరా?



వైదేహినగర్ రోడ్ నెంబర్-9లో లీక్ అవుతున్న నీరు



శ్రీఇందు కళాశాల వద్ద వాల్వు ద్వారా లీక్ అవుతున్న నీరు

ఎల్‌బీనగర్: వేసవి ముంచుకొస్తోంది.. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండే పరిస్థితి నెలకొంది. పలు కాలనీల్లోని నల్లోల్లో ఇప్పటికే లో ప్రెషర్‌తో తాగు నీరు సరఫరా అవుతున్నాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే అరకొర నీటి సరఫరాతో పలు కాలనీలో వాల్వులు ద్వారా మంచి నీటి సరఫరా చేసే సమయంలో లీకేజీల ద్వారా రోడ్లు పాలవుతున్నాయి. వాటర్ వర్క్స్ అధికారులు లీకేజీలను పట్టించుకోకపోవడంతో తరుచూ మంచినీరు రోడ్లపాలవుతోంది. లీకేజీల వల్ల నీరు కలుషితంగా మారే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే చిన్నారులకు విషజ్వరాలు సోకి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరో పక్క వాల్వుల వద్ద సరఫరా సమయంలో ఇలా లీకేజీలు కావడం ఎంత వరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. లీకేజీలు అవుతున్నా సరఫరా సమయంలో అధికారులు పర్యవేక్షణ లేదని పలువురు మండిపడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించిన లీకేజీలను అడ్డుకొని నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ఆస్పత్రికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

రూ. 3.30 లక్షల సొత్తు మాయం

చంచల్‌గూడ: కొడుకు చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తి ఇంటికి తిరిగి వచ్చేలోగా గుర్తు తెలియని ఆ ఇంట్లోని బంగారు ఆభరణాలు, రెండు ఐ ఫోన్లు చోరీ చేసుకెళ్లారు. ఈ సంఘటన మాదన్నపేట పీఎస్ పరిధిలోని నెహ్రూనగర్ మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలివీ... కుర్మగూడ డివిజన్ నెహ్రూనగర్‌లో నివాసముండే ఫిరోజ్ అలీ(42) మంగళవారం తన కుమారుడి చికిత్స కోసం కుటుంబ సభ్యులతో కలిసి కోఠిలోని ఈఎన్‌టీ ఆస్పత్రికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళాలు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని 7 తులాల బంగారు నెక్లెస్, 2 తులాల బంగారు ఉంగరాలు, రెండు ఆపిల్ ఐ ఫోన్లు కనిపించలేదు. ఇంట్లో చోరీ జరిగినట్లు గ్రహించిన బాధితుడు మంగళవారం రాత్రి మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించారు. ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) మెరుగైన వైద్య సేవలు అందించే విషయంలో పేదలకు ఎంతగానో ఉపకరిస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌కాలనీలో నివసించే మేరీ గ్రేసీ నరాల సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో వెంటనే ఆయన ఆపరేషన్‌కు అవసరమయ్యే ఖర్చుల వివరాలతో సీఎం సహానిధికి దరఖాస్తు చేశారు. ఆపరేషన్‌కు సంబంధించిన ఎల్‌ఓసీ కింది రూ. 2.50 లక్షల చెక్కును మంజూరు చేశారు. ఆచెక్కును బాధిత మహిళ మేరీగ్రేసీకి బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నాయకులు రాజిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, మేరీ జాకబ్, దయానంద్, భాస్కర్, సాగర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గో మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోవులను కాపాడాలని గోవిందుడిని, నందులను కాపాడాలని నందీశ్వరుడిని వేడుకుంటూ గ్రామ గ్రామాన గోమహత్యాన్ని తెలియజేస్తూ.. ఆగస్టు 6 నుంచి ఆగస్టు 31 వరకు హైదరాబాద్ నుంచి తిరుమలకు, తిరుమల నుంచి అరుణాచలానికి 25 రోజులు 786 కిలోమీటర్లు గో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బుధవారం ఉగాది పర్వదినం రోజున దుండిగల్‌లోని గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆశ్రమంలో గో మహా పాదయాత్ర పోస్టర్‌ను స్వామిజీ ఆవిష్కరించారు. గో రక్షణ కోసం తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, పాదయాత్ర దిగ్విజయంగా సాగుతుందరన్నారు.

ఐరన్ సిలిండర్ల నుంచి విముక్తి!

- ప్రమాదాలు, అధిక బరువు సమస్యలకు చెక్
- అందుబాటులోకి వంట గ్యాస్ ఫైబర్ సిలిండర్లు



దిల్‌సుఖ్‌నగర్: వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ అనగానే ఇనుముతో తయారైన గ్యాస్ బండే గుర్తుకొస్తుంది. చాలా మందికి ముఖ్యంగా మహిళలకు గ్యాస్ సిలిండర్ మార్చే విషయంలో ఎన్నో సమస్యలు ఎదురవుతూనే ఉంటాయి. బరువుగా ఉండటమే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. గ్యాస్ నిండుకుంటేగానీ సిలిండర్ ఖాళీ అయిందన్న విషయమే మనకు అర్థం కాదు. కొత్త గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో నిర్దేశించిన మేర సిలిండర్‌లో గ్యాస్ ఉందో లేదా అనే విషయమే తెలియదనే చెప్పొచ్చు. సిలిండర్‌ను ఇంట్లోని ఇక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే మహిళలు, వృద్ధుల ఇబ్బందులు చెప్పనలవికాదు. వీటన్నింటికీ చమరగీతం పాడుతూ ఇండేన్ గ్యాస్ కంపెనీ ఫైబర్‌తో తయారు చేసిన సిలిండర్లను అందుబాటులోకి తెచ్చింది.



ఫైబర్‌తో తయారు చేసిన గ్యాస్ సిలిండర్లు

- వంట గ్యాస్ వినియోగదారులకు 14 కేజీల గ్యాస్‌ను ఐరన్ సిలిండర్‌ల ద్వారా వివిధ కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. గ్యాస్ బరువు 14 కిలోలు ఉంటే ఇనుప బండ మరో 16 ఉంటుంది. ఈ లెక్కన నిండు గ్యాస్ బండ బరువు దాదాపు 30 కేజీలు ఉంటుంది.
- ఇంత బరువున్న సిలిండర్‌ను పై అంతస్తుల్లో ఉండేవారు తీసుకెళ్లాలంటే వారి పరిస్థితి మరింత దుర్భరంగా ఉంటుంది. వంటగదిలో సిలిండర్ పెట్టే ప్రాంతం తుప్పు పట్టి మరకలు పట్టే పరిస్థితి తెలిసిందే. ఈ మరకలు ఎంత శుభ్రం చేసినా పోకుండా పాలరాతి మార్బుల్ తదితర టైల్స్ స్వరూపాన్ని మారుస్తాయి. గ్యాస్ రెగ్యులేటర్ మార్చడం కూడా ఇబ్బందిగానే ఉంటుంది. అంతిమంగా ఇనుప బండ ఇంట్లో ఉంటే అగ్ని ప్రమాదాలు జరిగితే ఇది బాంబులా పేలి ఆస్తి, ప్రాణ నష్టం భారీగా జరిగే అవకాశం ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే.

ఫైబర్ సిలిండర్ ప్రత్యేకతలు...

- ఇండేన్ గ్యాస్ కంపెనీవారు ఫైబర్ సిలిండర్‌ను ప్రవేశపెట్టారు. వీటిని శాస్త్రీయంగా కంపోజిట్ సిలిండర్ అని పిలుస్తున్నారు. ఇది బరువు తక్కువతోపాటు భద్రత కోసం పలు జాగ్రత్తలు ఏర్పాటు చేశారు. ఫైబర్ సిలిండర్‌లో 10 కేజీల గ్యాస్ నింపేలా రూపొందించారు. ఇక సిలిండర్ ఆరు కేజీల బరువు ఉంటుంది. గ్యాస్ నింపిన తర్వాత సిలిండర్ మొత్తం బరువు 16 కేజీలు మాత్రమే ఉంటుంది.

పారదర్శకంగా ఫైబర్ సిలిండర్



ఏదానా అగ్ని ప్రమాదం సంభవిస్తే సిలిండర్ పేలకుండా ఫైబర్ సిలిండర్‌ను రూపొందించారు. అతినీల లోహిత కిరణాల నుంచి లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ అంటే వంట గ్యాస్ రక్షణ కల్పిస్తుంది. సిలిండర్‌ను వివిధ రకాల కంపోజిట్ పొరలతో తయారు చేశారు. గ్యాస్ ఎంత మేరకు వాడుకున్నామనే విషయం తెలుసుకునేలా సిలిండర్‌ను పారదర్శకంగా రూపొందించారు. ఐరన్ సిలిండర్‌కు దీటుగానే ఫైబర్ సిలిండర్ దృఢత్వాన్ని కలిగి ఉంటుంది. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఫైబర్ సిలిండర్ పేలకుండా పంక్చర్ అవుతుంది. దీంతో పేలుడు సంభవించే అవకాశం ఉండదు. – కిరణ్‌రావు, ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకుడు